నమస్తే తెలంగాణ

ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, గురువారం 2 జనవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ మంత్రులు సత్యవతి, ఎర్రబెల్లి

# కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

**హైదరాబాద్‌లో కలిసిన ఎర్రబెల్లి, సత్యవతి తదితరులు**



పాలకుర్తి/ కృష్ణకాలనీ, జనవరి 1 : ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు, శ్రేణులతో కలిసి న్యూ ఇయర్ కేక్ కట్ చేయడంతో పాటు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన కుమారుడు గౌతమ్‌రెడ్డి, రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు.



కేటీఆర్‌తో ఎమ్మెల్సీ సిరికొండ, మాజీ ఎమ్మెల్యే గండ్ర, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, రాష్ట్ర నేత రాకేశ్‌రెడ్డి

# ఇంకెన్నాళ్లీ నిర్లక్ష్యం!

- రూ. ఏడు కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- 18 నెలల క్రితం ప్రారంభించిన నాటి మంత్రి కేటీఆర్
- చిరు వ్యాపారులకు స్టాళ్లను కేటాయించిన అధికారులు
- గాంధీ పార్కులోనే జరుగుతున్న క్రయవిక్రయాలు
- తాజాగా మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

మహబూబాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : కూరగాయలు, మాంసం, చేపలు, పూలు, పండ్లు ఒకే చోట అమ్మకం జరిపేందుకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. 18 నెలల క్రితం దీనిని ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు అందులోకి చిరు వ్యాపారులను రప్పించడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సుమారు రూ. 7 కోట్లతో వెజ్, నాన్ వెజ్, పూలు, పండ్లకు సంబంధించి మూడు మార్కెట్ల సముదాయాలను కార్పొరేట్ స్థాయిలో ఒకేచోట నిర్మించింది. దీనిని 2023 జూన్ 30న అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించింది. ఈ సందర్భంగా మార్కెట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను చిరు వ్యాపారులకు కేటాయించాలని కేటీఆర్ ఆదేశించారు. అయితే మున్సిపల్ అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు కొత్త మార్కెట్లలోకి చిరు వ్యాపారులను అనుమతించడం లేదు. వారు గాంధీ పార్కులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. కోట్లు వెచ్చించి నిర్మించిన మూడు రకాల మార్కెట్లను ఇప్పటివరకు చిరు వ్యాపారులకు ఎందుకు కేటాయించడం లేదో తెలియడం లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇటీవల జరిగిన మండలి సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని తక్కళ్లపల్లి సభ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని, స్టాళ్లను చిరు వ్యాపారులకు కేటాయించాలని కోరారు. అయినప్పటికీ ఇప్పటివరకు స్టాళ్లను చిరు వ్యాపారులకు కేటాయించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరు వ్యాపారులు సైతం మున్సిపల్ శాఖ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే మార్కెట్లను నిర్మించినా తమకు ఎందుకు అప్పగించడం లేదని ఆందోళన చెందుతున్నారు. కాగా, గత ప్రభుత్వ హయాంలోనే తొర్రూరులో ఇదే నమూనాలో నిర్మించిన మార్కెట్లను ప్రారంభించగా అందులో చిరు వ్యాపారులు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను చిరు వ్యాపారులకు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## వెంటనే కేటాయించాలి



బీఆర్ఎస్ హయాంలో అత్యాధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించారు. అప్పటి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించినప్పటికీ ఇందులోని స్టాళ్లను చిరు వ్యాపారులకు కేటాయించడంలో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా స్టాళ్లను చిరు వ్యాపారులకు కేటాయించాలి. లేదంటే వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది.

–ఎడ్ల వేణు, కౌన్సిలర్, మహబూబాబాద్




మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

# పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటా..

- రూ. 7 కోట్లతో పాఠశాలను అభివృద్ధి చేస్తా
- శివాలయం పునర్నిర్మాణానికి కృషి చేస్తా
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఇనుగుర్తి, జనవరి 1 : తాను పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. బుధవారం ఆయన మహబూబాబాద్ జిల్లాలోని తన సొంత గ్రామమైన ఇనుగుర్తి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. రూ. 7 కోట్లతో పాఠశాలను అభివృద్ధి చేస్తానన్నారు. తన తల్లిదండ్రులు వద్దిరాజు నారాయణ–వెంకటనర్సమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. కోటి, ఎంపీ నిధుల నుంచి రూ. 6 కోట్లు కేటాయించి అత్యాధునిక హంగులతో పాఠశాల భవనాన్ని ఈ ఏడాదే నిర్మిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయిస్తానని, పాఠాలు బోధించేందుకు గదులను సైతం నిర్మిస్తానన్నారు. అలాగే సకల హంగులతో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శివాలయం పునర్నిర్మాణానికి, మండలాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ డీకొండ వెంకన్న, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, పార్టీ ప్రధాన కార్యదర్శి గండు నాగన్న, మాజీ ఎంపీటీసీ పింగిలి రజిత శ్రీనివాస్, బైరు బాలయ్య తదితరులు ఉన్నారు.



గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

## అమలు జాడేది?

సింగరేణి సంస్థలో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ గుర్తింపు సంఘంగా గెలువనప్పటికీ ఏఐటీయూసీ కంటే ఒక స్థానం ఎక్కువే గెలుచుకుంది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అయినప్పటికీ సింగరేణి కార్మికులకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను ఇప్పటికీ అమలు చేయడం లేదు. కొత్త బొగ్గు గనుల ఏర్పాటు ఊసే లేదు. సంస్థలో బొగ్గు అన్వేషణ పనులు నిలిచిపోతే పట్టించుకునేవారు కరువయ్యారు. అలాగే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే బొగ్గు బ్లాకులను ప్రైవేటుకు అప్పగించడంపై కార్మికులు మండి పడుతున్నారు. కార్మికులకు సొంతింటి పథకం కింద 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం ఇప్పిస్తామని ముఖం చాటేశారు. పెర్క్ అలవెన్స్‌లపై ఆదాయపు పన్ను యాజమాన్యంతో కట్టిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. అన్ని సింగరేణి ఆసుపత్రులను ఆధునీకరించి, ఒక సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు చేయిస్తామని చెప్పిన హామీ మరిచారు. కార్మికునికి, కార్మికుల కుటుంబ సభ్యులకు ఎలాంటి వ్యాధులు వచ్చినా హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్‌లకు రెఫర్ చేస్తున్నారు. మహిళా కార్మికులకు సర్ఫేస్‌లోనే ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతం మహిళా కార్మికులను సైతం గనుల్లోకి దింపేందుకు రంగం సిద్ధమవుతోంది. ఏఐటీయూసీ నాయకులు సైతం ఐఎన్‌టీయూసీ నాయకులను ఏ మాత్రం తీసి పోలేదని, 47 హామీలు ఇచ్చి ఒక్క హామీని నెరవేర్చలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

# గని కార్మికులకు ఆరు గ్యారెంటీలు ఏమైనయ్?

## ఏడాదైనా అమలుచేయని కాంగ్రెస్ సర్కారు

## సింగరేణిలో హక్కుల సాధన ప్రశ్నార్థకం

- ఐఎన్‌టీయూసీ హామీలు బుట్టదాఖలు
- అమలుకు నోచుకోని ఏఐటీయూసీ వాగ్దానాలు
- టీబీజీకేఎస్ సాధించిన హక్కులే దిక్కు
- వారసత్వ ఉద్యోగాల హక్కు చరిత్రాత్మకం
- కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్న కార్మికులు




*కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా సింగరేణి గని కార్మికులకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదు. ఆరు గ్యారెంటీల పేరుతో అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి వాటిని నెరవేర్చక విఫలమైన రేవంత్ సర్కారు.. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రకటించిన హామీలనూ అటకెక్కించింది. హామీలిచ్చి సంవత్సరం గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కార్మికుల హక్కుల సాధన ప్రశ్నార్థకమైంది. కాగా బీఆర్ఎస్ హయాంలో టీబీజీకేఎస్ కొట్లాడి సాధించిన వారసత్వ ఉద్యోగాలు సహా ఇతర హక్కులను ఇప్పటికీ కార్మికులు అనుభవిస్తుండగా కేసీఆర్ పాలనను, చరిత్రాత్మక నిర్ణయాలను గుర్తుచేసుకుంటున్నారు.*

*– జయశంకర్ భూపాలపల్లి, జనవరి 1(నమస్తే తెలంగాణ)*

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు, సింగరేణి కాలరీస్ కంపెనీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి ఏడాది గడుస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సింగరేణి సంస్థలో ఆరు డివిజన్లు కాంగ్రెస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ), ఐదు డివిజన్లు సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గెలుచుకున్నాయి. ఐఎన్‌టీయూసీ ఎక్కువ స్థానాలు గెలిచినప్పటికీ ఓట్లు ఏఐటీయూసీకి అధికంగా రావడంతో ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా ఎన్నికైంది. కాగా, ప్రజలకు ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు ప్రకటించి విఫలమైన కాంగ్రెస్, సింగరేణి ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ సైతం ఆరు గ్యారెంటీలు ప్రకటించి ఇప్పటివరకు ఒక్కటీ అమలు చేయలేకపోయింది. ప్రభుత్వం సైతం అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ ఇచ్చిన గ్యారెంటీలపై దృష్టిసారించడం మరచింది. ఏఐటీయూసీ ఇచ్చిన ఎన్నికల హామీలు సైతం ఇప్పటివరకు అమలుకు నోచుకోలేకపోయాయి. దీంతో బొగ్గు గని కార్మికుల హక్కుల సాధన ప్రశ్నార్థకంగా మారింది.

**ఆరు గ్యారెంటీలు ఇవే..**

గుర్తింపు ఎన్నికల సమయంలో ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే ఆరు సింగరేణిలో గ్యారెంటీలను అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ నేతలతో పాటు కాంగ్రెస్ పెద్దలు సైతం బొగ్గు గనుల్లో పర్యటించి హామీలు గుప్పించారు. మరోవైపు ఏఐటీయూసీ సైతం 47 హామీలు ఇచ్చింది. ఎన్నికలు జరిగి ఏడాది గడిచినా ఎవరూ ఇచ్చిన హామీలపై నోరు మెదపడం లేదు. ముఖ్యంగా కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ.. నూతన అండర్ గ్రౌండ్ బొగ్గు గనులను ప్రారంభింపజేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, కార్మికులందరికీ సొంతింటి పథకం కింద 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని, ప్రకృతికి విరుద్ధంగా ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న సింగరేణి కార్మికులకు చెల్లించే అలవెన్స్‌ల (పెర్క్) ఆదాయంపై ఇన్‌కంటాక్స్ యాజమాన్యంతో కట్టిస్తామని, ఇప్పుడు ఉన్న అన్ని ఏరియా దవాఖానలను ఆధునీకరించి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయిస్తామని, మహిళా కార్మికులకు అన్ని మౌలిక వసతులు కల్పించి గౌరవప్రదమైన ఉద్యోగం (అండర్ గ్రౌండ్‌లోకి దింపకుండా) సర్ఫేస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని ప్రకటించారు.

### ఏడాదిలో ఒక్కటి కూడా చేయలే..



ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు సింగరేణిలో అధికారంలో ఉండి ఏడాది కాలంలో ఒక్క హక్కు సాధించలేదు. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ యూనియన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు పాతరేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఐఎన్‌టీయూసీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై నోరు మెదపడం లేదు. ఏడాది కాలంగా రెండు సంఘాలు, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో కార్మికుల హక్కుల సాధన ప్రశ్నార్థకంగా మారింది. గనుల్లోకి అమ్మాయిలను దింపేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అందరినీ గోదావరిఖనిలో రెండు గనులను ఎంపిక చేసి దింపే ఆలోచనలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు సింగరేణిలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేయడం లేదు.

– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

### బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సాధించిన హక్కులు..

సింగరేణి సంస్థలో బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సాధించిన హక్కులనే నేడు కార్మికులు అనుభవిస్తున్నారు. ఏఐటీయూసీ పోగొట్టిన వారసత్వపు ఉద్యోగాల హక్కులను కేసీఆర్ మళ్లీ తీసుకురావడంతో సింగరేణిలో యువ కార్మికులు పెరిగిపోతున్నారు. నాడు టీబీజీకేఎస్ సాధించిన హక్కులను గుర్తు చేసుకుంటున్నారు.

- జాతీయ కార్మిక సంఘం కాలరాసిన వారసత్వపు ఉద్యోగాల హక్కును తిరిగి తీసుకొచ్చి 12వేల మందికి పైగా కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం.
- కార్మికుల తల్లిదండ్రులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం.
- జాతీయ కార్మిక సంఘాల వైఫల్యంతో నిలిచిపోయిన 3400 పెండింగ్ ఉద్యోగాలు డిపెండెంట్లకు ఇప్పించడం.
- అంబేద్కర్ జయంతి, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్‌లకు అదనపు పీహెచ్‌డీలు.
- రూ.10 లక్షల ఇంటి రుణానికి వడ్డీ తిరిగి చెల్లించడం.
- బేసిక్‌పై ఒక శాతం విద్యుత్ చార్జీలు రద్దు. ఏసీ పెట్టుకునేందుకు అనుమతి. ఉచిత విద్యుత్.
- గని ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ. 20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- డ్యూటీలో ఉండి సహజ మరణం చెందిన కార్మిక కుటుంబానికి రూ. 15 లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- తెలంగాణ ఇంక్రిమెంట్, అండర్‌గ్రౌండ్ కార్మికులకు యూనిఫాం.
- లాభాల వాటా 16 శాతం నుంచి 32 శాతానికి పెంపు.
- కోలిండియాలో లేని విధంగా సింగరేణిలో మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాల్లో అవకాశం.
- ఉద్యోగం వద్దు అనుకునే డిపెండెంట్లకు కోలిండియా కన్నా భిన్నంగా రూ. 25 లక్షలు చెల్లింపు.
- 190/240 మస్టర్లు నిండిన సంవత్సరంలోపే బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ.
- ఐఐటీ, ఐఐఎంలలో సీటు సాధించిన కార్మికుడి పిల్లలకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించడం.
- సింగరేణి కార్మికుల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం రామగుండంలో సింగరేణి మెడికల్ కళాశాల ఏర్పాటు. కార్మికుల పిల్లలకు ఐదు శాతం రిజర్వేషన్.
- సూపర్‌వైజర్ సిబ్బందికి 50 శాతం బంగ్లా అలవెన్స్ పెంపు.
- సింగరేణి ఏరియా ఆస్పత్రి, కొత్తగూడెం కార్పొరేట్ ఆస్పత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లను ఏర్పాటు చేయడం.
- మహిళా కార్మికులకు చైల్డ్‌కేర్ లీవ్ 2 సంవత్సరాలు ఇప్పించడం.
- గతంలో కంటే భిన్నంగా పెళ్లి అయినా, విడాకులు అయినా, వితంతువు, ఒంటరి మహిళ కూతురు, వితంతు కోడలకు కూడా డిపెండెంట్‌గా అవకాశం.
- వికలాంగులకు సర్ఫేస్‌లో ఉద్యోగం.
- కేసీఆర్ ఆదేశాలతో సింగరేణి సంస్థలో ఇక ముందు డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మించాలని నిర్ణయం.ఇందులో భాగంగా భూపాలపల్లిలో 994, సత్తుపల్లిలో 440 క్వార్టర్ల నిర్మాణం.
- వివిధ ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 3800లకు పైగా నూతన ఉద్యోగాలు.
- సింగరేణి వ్యాప్తంగా ఏసీ ఫంక్షన్ హాళ్లు.
- 600 మంది డిస్మిస్ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు.
- వృత్తి పన్ను శాశ్వతంగా రద్దు.
- స్పోర్ట్స్ లీవ్‌లను ఓడీగా మార్చి మస్టర్ కింద గుర్తించడం.
- సకల జనుల సమ్మె కాలపు వేతనం చెల్లించడం.
- సొంత ఇళ్లలో ఉండే కార్మికులకు 100 యూనిట్ల విద్యుత్ చార్జీల చెల్లింపు.



వరంగల్ కోటలోని కీర్తితోరణాల మధ్య శిల్ప సంపదను వీక్షిస్తున్న పర్యాటకులు



భక్తులతో రద్దీగా ఉన్న భద్రకాళీ ఆలయం



గోవిందరావుపేట : దుంపిల్లగూడెంలోని పంట పొలంలో కేక్ కట్ చేస్తున్న మహిళా కూలీలు

# నయా జోష్

- ఆలయాల్లో ‘కొత్త’ సందడి.. పోటెత్తిన భద్రకాళీ, వేయిస్తంభాల గుళ్లు

*నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను ఉమ్మడి జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే సంబురాలు జోరందుకోగా బుధవారం ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేసి చిన్నపెద్దా ఆడిపాడారు. మహిళలు తీరొక్క రంగులతో ఇండ్ల ముందు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. అలాగే ఆలయాల్లో ‘కొత్త’ సందడి కనిపించింది. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, భద్రకాళీ, రామప్ప సహా ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేలాదిగా తరలివచ్చిన జనం దర్శనం కోసం బారులు తీరారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడంతో ఓరుగల్లు కోటతో పాటు ఖుష్‌మహల్, ఏకశిల పార్క్ పర్యాటకులతో కిటకిటలాడాయి.*

**- నమస్తే నెట్‌వర్క్, జనవరి 1**



హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో బారులు తీరిన భక్తులు